# అంధకారంలో మెరుపు

కాలేజీ వైపు నడుస్తోంది రేఖ. ఆమె ఆలోచనలతోపాటు ఆమె అడుగులుకూడా బరువెక్కాయి. మెల్లిగా స్ప్రింగ్ డోర్ తెరచుకుని ప్రిన్సిపాల్ రూములో అడుగు పెట్టింది. శోకదేవ తలావస్తున్న రేఖను జాలిగా చూసింది ప్రిన్సిపాల్.

"రేఖా వచ్చేసావా"

"వచ్చేసా మేడమ్. శాశ్వతంగా వచ్చేసాను. గుక్క తిప్పుకోకుండా ఏడుస్తూ ప్రిన్సిపాల్ కౌగిల్లో ఒదిగిపోయింది. అంత ఉత్సాహంగా వెళ్ళిన రేఖ రూపమే గుర్తుకొచ్చింది ఆవిడకు.

"మేడమ్ నా రిజిగ్నేషన్ లెటరిదిగోనండి. నేనింక కాలేజీకిరాను. తూనీగలా పరుగెత్తుకుంటూ వచ్చి ఎదురుగా ఉన్న టేబులు మీద పెట్టింది రేఖ.

ప్రిన్సిపాల్ దేవకీదేవి తలెత్తి ఆశ్చర్యంగా చూసింది రేఖను.

"నేను ఈరోజే బొంబాయి వెళుతున్నానండి. అక్కడ నుంచే అమెరికా వెళ్ళిపోతాను."

దేవకీదేవి నమ్మలేనట్లు చూసింది. ఇంక ఉండబట్టలేక "రేఖా! రిజైన్ ఇవ్వడం అంత మంచిదికాదమ్మా! మరోసారి ఆలోచించుకో!"

"బాగా ఆలోచించానండీ! ఈరోజే బొంబాయి వెడుతు న్నానండీ."

"రేఖా! నిన్ను నిరుత్సాహ పరుస్తున్నాననుకోకు. ఇప్ప టికే రెండుసార్లు అమెరికా వెళ్ళడానికి ఉద్యోగం రిజైను చేశావు. మన ఛైర్మన్ మంచివారు కనుక నీ సర్వీసు బ్రేక్ లేకుండా చేశారు. ఈసారి శెలవు పెట్టి వెళ్ళమ్మా, ఎందుకేనా మంచిది. అందుకో ఆమె కంఠం జీరపోయింది.

"ఈ అమాయకపురాలికి అన్యాయం జరగకూడదు" అనుకుంది మనస్సులో.

రేఖ అవేమీ గమనించే స్థితిలో లేదు.

"ఈసారి ఇంక తిరిగి రానండీ! మధు బొంబాయి వచ్చా డట - రాత్రి టెలిగ్రామ్ ఇచ్చాడు. మా నాన్నగారు నన్ను బొంబాయి తీసుకెడుతున్నారు. ఇంకా సద్దుకోవలసినవి చాలా ఉన్నాయి" లెటర్ అక్కడే వదిలి రేఖ వెళ్ళిపోయింది.

ఆ లెటర్ తీసి డ్రాయర్‌లో పడేసిన దేవకీదేవి రేఖ వెళ్ళిన వైపే చూస్తూ అలాగె ఉండిపోయింది.

ఆనాడు సీతాకోక చిలుకలా ఎగురుకుంటూ వెళ్లిన రేఖ ఈనాడు ఈవిధంగా తిరిగి వచ్చేసింది. దేవకీదేవి మనస్సు బాధతో మూల్గింది. "ఈనాడు ఎంతోమంది ఆడపిల్లలు ఈవిధంగా మోస పోయి బలైపోతున్నారు. ఇలాటి వాళ్ళను ఆదుకోడానికి ఏ చట్టాలు పనికిరావు. తనిమీద కేసుపెట్టి శిక్షపడేటట్టు చూడచ్చు కాని ఈమె జీవితం సరిదిద్దటానికి ఏ చట్టం ఉపకరించ లేదు అనుకుంది.

తన ఒళ్ళో ముడుచుకుపోయిన రేఖ భుజంమీద తడుతూ "ఊరుకో రేఖా! ఊరుకో" అంది. అంతకంటె ఏమీ అనలేక.

పెళ్ళై నాలుగు సంవత్సరాలైంది రేఖకు. ఆనాలుగుసంవత్సరాలలో భర్తను రెండుసార్లు మాత్రమే దూరంనుంచి చూసింది. పేరుకు పెళ్ళయింది. కాని అతని స్పర్శ ఆమెకు తెలియదు. ఇంతకు ముందు రెండుసార్లు వస్తున్నానని టెలిగ్రామ్ ఇచ్చాడు. అత్తమామలు అమెరికా ప్రయాణానికి సిద్ధంగా ఉండమని కబురు పెట్టారు.

మనస్సులో జోరీగల్లా పాడుతున్న కోటి కోరికలతో సామానులన్నీ సద్దుకుని సిద్ధంగాకూర్చుంది. పైగా ఇంక ఉద్యోగం ఎందుకని రెండుసార్లు రిజైన్ ఇచ్చేసింది. కాని అతను రానేలేదు.

ఈసారి బొంబాయి వరకు వచ్చి మరీ టెలిగ్రామ్ ఇచ్చాడు. అందుకే అంత సంతోషం. ఎన్నో మధురమైన భావాలు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఎన్నో జరగబోయే సంఘటనలు ఆమె కళ్ళముందు జరిగిపోతున్నాయి.

తను బొంబాయి చేరుకుంటుంది. అతనున్న ఖరీదైన హోటలు గదిలో ఒంటరిగా అడుగు పెడుతుంది. తనని చూడగానె అతను రెండు చేతులుచాపి కౌగిట్లో బంధించివేస్తాడు నీవు లేనిదే నా జీవితమే లేదంటాడు, తనను నడిపించుకుంటూ తీసుకెళ్ళి విమానం ఎక్కిస్తాడు. విమానంలో అతనిని ఆనుకుంటూ కూర్చుంటుంది. ఆకాశంలోని ఎన్నో సుందర దృశ్యాలు ఆమె కళ్ళముందు కదిలిపోతున్నాయి. బొంబాయి వెళ్ళిపోయి అతని

ముందు వాలాలనే కోరిక ఆమెను తొందరపెడొతోంది. అనుకోని అదృష్టం కళ్ళముందుకొచ్చి ఆగుతోంది. ఆ కంగారులో ఆమెకు ఉద్యోగం రిజైను ఇవ్వాలనే తప్ప మరేమీ తోచలేదు, ఈనాడు శోకంలో మరేమీ తెలియడంలేదు రేఖకు. జరిగిన సంఘటనే ఆమె కళ్ళముందు మెదలిపోతోంది. ఆమె ప్రిన్సిపాల్ భుజంమీద వాలి ఉన్నా ఆమె మనస్సు ఎటో పోతోంది.

ఆనాడే బొంబాయి చేరిన రేఖ తండ్రి మధు టెలిగ్రాములో ఉన్న ఎడ్రస్సు ప్రకారం హోటల్‌కి చేరుకున్నారు. ఆ హోటల్‌ని ఆశ్చర్యంగా జూసిన తండ్రి "ఎంతపెద్ద బిల్డింగ్ అమ్మా!" అన్నాడు.

"ఇదేం బిల్డింగ్ నాన్నగారు అమెరికాలో ఇంతకంటె పెద్ద పెద్ద భవనాలుంటాయి" అంది. వెళ్ళబోయే అమెరికాను గొప్ప చేసి చెప్పుకుంటూ.

కూతురు అదృష్టాన్ని తలచుకుని మురిసిపోయాడాయన. లిఫ్టులో అతను చెప్పిన రూమ్‌కి చేరుకున్నారు. రూం. నెం. 261 తండ్రి ఆగి బయటనున్న బెల్ నొక్కాడు. తలుపు తెరచుకుంది.

ఆ తండ్రీ కూతుళ్ళు రెప్పపాటు వెయ్యడం మరిచిపోయి అతనివైపే చూస్తున్నారు. ఇరవై ఎనిమిది సం॥ యువకుడు పచ్చని శరీర ఛ్ఛాయలో నల్లని సూటులో మిలమిలా మెరిసిపోతూ నిలబడి ఉన్నాడు. అతని రూపు రేఖలు ఆంధ్రదేశములోని ఎవరితోను పోల్చలేనట్లుగా ఉన్నాయి. అతను మాత్రం వాళ్ళిద్దరిని మామూలుగానె చూసాడు. ఇద్దరిని లోపలికి రమ్మన్నట్టుగా సంజ్ఞ చేసి తాను ఒక కుర్చీలో కూర్చున్నాడు.

తండ్రి వెనకే అడుగులు తడబడుతుంటే మెల్లిగా నడుచు కెళ్ళి తండ్రిపక్కనే సోఫాలో కూర్చుంది.

చాలా ముభావంగా ఉన్న అల్లుణ్ణి మామగారే పలకరించా లనుకున్నారు.

"ఎప్పుడొచ్చావు బాబూ"

"త్రీడేస్ అయింది" ఎటో చూస్తూ సమాధానమిచ్చాడు.

"మూడురోజులైతే ఇప్పుడా తెలియచెయ్యడం" తండ్రి మనస్సు ఎందుకో సంశయంతో నిండిపోయింది.

రేఖ ఈ ప్రపంచంలోనే లేదు.

చుట్టూ చల్లగాలి. దూరంగా అగరుబత్తుల వాసన. అంత కంటె దగ్గరగా అతని నుంచి ఫారిన్ పెరిఫ్యూమ్ వాసన. మనస్సు మధురమైన భావాలతో నిండిపోయింది. తలెత్తి మత్తుగా చూసింది అతనివైపు. పెళ్ళిలో భయంతో, కంగారుతో, భర్తను సరిగా చూడలేదు. తన భర్తను రెప్పవాల్చక చూసుకుంది. ఆనందంతో ఆమె బుగ్గలు కెంపులయ్యాయి.

కాని అతని చూపులు ఎటో ఉన్నాయి. ఒక్కసారైన తన చూపులతో కలుపుతాడనుకుంది. కాని అతని చూపులు తనవి కావని గ్రహించుకోలేకపోయింది.

పెళ్ళాడిన భర్త దుష్యంతుడు తనను తెలియదని చెప్పి నప్పుడు శకుంతల తనను తాను పరిచయం చేసుకుంది. కాని ఇక్కడ తనకా అవకాశం లేదు. తానెవరో అతనికి తెలుసు, మరిచి పోలేదు. జ్ఞాపకముండ బట్టే రమ్మని టెలిగ్రామ్ ఇచ్చాడు.

తాను వచ్చింది. కాని కావలసిన ఆదరణ. ఆప్యాయత అతనిలో లేవు,

నిరాశతో రేఖ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రెప్పలు కొట్టు కోగానె జలజల రాలాయి. కళ్ళనున్న కాటుకను కడిగి వేస్తూ ఆ నీళ్ళు కిందికి జారడం మొదలు పెట్టాయి.

ఆనాడు మేనమామ కొడుకు తనను చేసుకుంటానని వెంట బడ్డాడు. పెళ్ళిచెయ్యక పోతే సన్యాసినై పోతానన్నాడు. తను కూడా అతనినే చేసుకోవాలనుకుంది. చిన్నతనం నుంచి బావ అంటే ఆమెకు చాలా ఇష్టం. రేఖను ప్రాణంగా చూసుకునే వాడు. కాని అతను అంతస్తుకు చాలడని తండ్రి అతనికిచ్చి పెళ్ళిచెయ్య డానికి తిరస్కరించాడు. బంధుత్వానికి అంతస్తు లేమిటని బందువు లంతా నిందించారు కాని తండ్రి వినలేదు. తన కూతురికి ఫారిన్ అల్లుడే రావలని పట్టు పట్టాడు. వెతికి వెతికి ఈ సంబంధం కుదిర్చాడు. తన కూతురు గొప్పింటికెళ్ళి పోతుందని మురిసి మురిసి పోయాడు. కాని ఈనాడు ఆ అల్లుడు కొరకరానికొయ్య. చెయ్యికందకుండా దాటి పోతున్నాడు. అందుకే ఆ తండ్రికి అల్లుని ప్రవర్తన చూస్తుంటే లోపల భయపడుతూనే ఉన్నాడు. ఇదివరకు రెండుసార్లు వస్తానని రానందుకు ఆయనెంతో బాధ కాని అతని తల్లి తండ్రులు ఏదో నచ్చచెప్పి బతిమాలారు. కాని మనస్సులో ఒక మూల భయంగానె ఉంది.

మఘ కరీదైన తన ఫారిన్ బ్యాగ్ తెరిచాడు. అంతకంటె అందంగా పాలనురుగు లాంటి కాగితాలు తీసి రేఖ తండ్రి చేతిలో పెట్టాడు, ఆ కాగితాలు అందుకున్న అతని చేతులు వణికాయి.

"మీ అమ్మాయి చేత సంతకం పెట్టిస్తే...మాటపూర్తి కాలేదు. ఆ తండ్రిచేతులు వణకడం మొదలు పెట్టాయి. గుండె ఒక్కసారి ఆగి తిరిగి కొట్టుకున్నట్లు అనిపించింది. అంతవరకు అంత అందంగా కనబడిన మధు రూపం ఆయన కంటికి రాతి విగ్రహంలా కనబడింది. అతి మధురంగా వినిపించిన అతని కంఠం గుడ్లగూబ అరుపులావినబడింది. జరగకూడనిది జరిగి పోయింది. కూతురు పచ్చని జీవితం మసై పోతోంది. గుండె రాయి చేసుకున్నాడు ఆ తండ్రి.

"ఇక్కడ సంతకం పెట్టమ్మా" కూతురికి చూపించాడు. తండ్రిముఖం చూసీ సంగతి గ్రహించిన రేఖ తండ్రి చెప్పిన చోట సంతకం పెట్టింది. "ఇక మిగిలింది గాఢాంధకారమని" నిర్ణయించుకుంది. పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంది. మనసును అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నం చేస్తోంది. ఆమె ఊహలు నిజాన్ని గ్రహించాయి. "మనసులేని మనిషి తన మెడలో తాళి కట్టాడు. తాను నమ్మింది. అతనిచుట్టూ అల్లుకుంది ఊహల లతలు. వాటిని తెంచుకోవాలంటె బాధగానె ఉంటుంది. మనసు లేని మనిషిని ప్రేమభిక్ష పెట్టమని అడగడం అవివేకం అవుతుంది."

"నాథా!" అంటూ కాళ్ళ మీదపడడం మూర్ఖత్వ మవుతుంది. అందుకే కోరికలను చంపుకుని నాలుగేళ్ళు పెంచుకున్న మమకారాన్ని తెంచుకుని లేనిధైర్యం తెచ్చుకుంది.

''నాన్నా ఇక వెడదాంరండి'' లేచి నిలబడింది.

వణికే శరీరాన్ని ధైర్యంతో కట్టుకుంటూలేచాడు ఆ తండ్రి.

మధు ఇరవై ఐదు వేలకు చెక్ అందించ బోయాడు. విదిలించి కళ్ళెర్రచేసి చూసింది రేఖ. కంగారు పడిన మధు రేఖ ముఖంలోకి చూడలేక చెయ్యిముడుచుకుని తల పక్కకు తిప్పు కున్నాడు.

"నా బ్రతుకు పాతిక వేలకు విలువ కట్టినట్టున్నావు. నా జీవితాన్ని విలువ కట్టడానికి నీ జీవితకాలం చాలదు. నా బ్రతుకు నిలుపుకోడానికి నీనీడ పనికిరాదు."

నిలదీసి అడిగింది రేఖ. ఆమె కళ్ళు నిప్పులు కురుస్తు న్నాయి.

ఆ నిప్పులు తనని భస్మం చేస్తాయని భయపడ్డాడు మధు.

అక్కడ నుంచి ముందుకు కదిలింది రేఖ.

ఆమెధైర్యానికి ఆ తండ్రితోపాటు మధు కూడా ఆశ్చర్య పోయాడు.

అంత సునాయాసంగా తనసమస్య పరిష్కార మవుతుంద నుకోలేదు మధు.

"ఆమె ఏడుస్తుంది. మొత్తుకుంటుంది. కాళ్ళ వేళ్ళ పడి బతిమాలుకుంటుంది. తల్లితండ్రులు తిడతారు. అందరిని తానొ క్కడే ధైర్యంగా ఎదిరించాలి.'' సమస్యల్ని ఎదుర్కోడానికి సిద్ధమైవచ్చాడు. కాని చిటికెలో తేలిపోయింది సమస్య. అను కోకుండా మనస్సులో ఆమె సంస్కారానికి ఆశ్చర్యపోయాడు. వెడుతున్న ఆమెను ఆశ్చర్యంగా చూసాడు. ఉన్నతమైన ఆమె ఆకారంకదిలి వెడుతుంటే ఎందుకో అతని మనస్సు కాస్త చలించి నట్లయింది. అంతకుముందులేని గందరగోళం ఏదో ఆతని మన

స్సును వేధించడం ప్రారంభించింది. ఎంత త్వరగా అక్కడ నుంచి వెళ్ళిపోతే అంత మంచి దనుకున్నాడు. లేచి ప్రయాణానికి పెట్టె సద్దుకోవడం ప్రారంభించాడు.

ఇంటికి తిరిగి వచ్చిన రేఖ తండ్రి కుర్చీలో అచేతనంగా వాలి పోయాడు. తండ్రిని చూసిన రేఖ కెవ్వుమంది. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో ఎప్పుడోకలిసి పోయాయి. పెళ్ళయిన మరుసటి సం॥ తల్లి పోయింది రేఖకు. అప్పగారికి వివాహమై అత్తవారింటికి వెళ్ళిపోయింది. అన్నగారు ఉత్తరప్రదేశ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ వార్త తెలిసి అందరు పరుగెత్తుకుంటూ వచ్చారు. కర్మకాండలన్నీ పూర్తయ్యాయి. ఎక్కడి వారక్కడికి వెళ్ళిపోయారు. రేఖ వంటరిగా మిగిలిపోయింది. ఆమె చుట్టూ గాడాంధకారం. తన జీవితం తిరిగి చిగురిస్తుందనే ఆశలేదు. తెలుగుదేశంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆడ పిల్లలకు అది అందుబాటులో లేని విషయం. తనంతటతానె అది కల్పించుకోవాలి. అందుకే స్కూలుకు వెళ్ళింది. ప్రిన్సిపాలును చూడగానె ఆ దుఃఖం పొంగివచ్చేసింది.

"రేఖా ధైర్యంగా ఉండాలి" ఆవిడ తిరిగి భుజంతట్టింది. రేఖ కళ్ళుతుడుచుకుంది. అంధకారంలో మెరుపులా కర్తవ్యం గుర్తుకొచింది. కళ్ళముందు చిన్నపిల్లలు మెదిలారు. రిజిస్టరు తీసుకుని క్లాసువైపు నడిచింది.

(విశ్వరచనలో బహుమతి పొందిన కథ)